తాగునీరు.. అందించారు


- సీతమ్మధార కొండవాలు ప్రజలకు తీరిన తాగునీటి కష్టాలు
- ఏఎస్సార్ నగర్, బిలాల్ కాలనీల్లో జీవీఎంసీ వాటర్ ట్యాంకులు, కుళాయిల ఏర్పాటు
- ప్రతి రోజూ సంపు ద్వారా నీటి సరఫరా
- 400 కుటుంబాలకు ప్రయోజనకరం
- కొండవాలు నివాసుల హర్షం


ఏఎస్సార్ నగర్‌లో తాగునీరు సరఫరా చేసే సంపు




బిలాల్ కాలనీ కొండవాలు ప్రాంతంలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులు


కుళాయి వద్ద తాగునీరు పట్టుకుంటున్న ఏఎస్సార్ నగర్ మహిళలు


సీతమ్మధార దరి బిలాల్ కాలనీ కొండవాలు ప్రాంతం

సీతమ్మధార: సీతమ్మధార కొండవాలు ప్రాంతంలో ఇళ్లు కట్టుకుని జీవిస్తున్న వారి తాగునీటి కష్టాలు తీరాయి. గత ప్రభుత్వ హయాంలో గుక్కెడు తాగు నీటి కోసం ఇక్కడి ఏఎస్సార్ నగర్, బిలాల్ కాలనీల వాసులు నానా అవస్థలు పడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగేళ్లుగా వీరికి తాగునీటితోపాటు జీవీఎంసీ కుళాయి నీరు సక్రమంగా రావడంతో కొండవాలు నివాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


ఇదీ గత పరిస్థితి..

సీతమ్మధార దరి ఏఎస్సార్ నగర్, బిలాల్ కాలనీ కొండవాలు ప్రాంతాల్లో దాదాపు 400 కుటుంబాలు 30 ఏళ్లుగా నివసిస్తున్నాయి. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి జీవనోపాధి పనుల నిమిత్తం ఇక్కడికి వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. గతంలో వీరికి తాగేందుకు నీరు లేక చాలా ఇబ్బందులు పడ్డారు. కొండచారల నుంచి వచ్చిన ధార నీటిని పట్టుకుని తాగుతుండేవారు. కొండవాలు నివాసుల అవస్థలు వర్ణనాతీతంగా ఉండేవి. కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోక అనేక సమస్యలతో సతమతమయ్యేవారు.

సీతమ్మధార కొండవాలు ప్రాంతాలు
ఏఎస్సార్ నగర్, బిలాల్ కాలనీ
నివసిస్తున్న జనాభా **400** కుటుంబాలు
మూడు వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్ల ఏర్పాటుకు చేసిన ఖర్చు రూ.**5** లక్షలు

నేడు మారిన స్థితి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఈ ప్రాంతంలో స్థానికుల తాగునీటి అవసరాలు తీరేలా చర్యలు చేపట్టారు. జీవీఎంసీ నిధులు రూ.5 లక్షలతో ఏఎస్సార్ నగర్, బిలాల్ కాలనీలో మూడు వాటర్ ట్యాంకులు, కొండపైకి తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ కుళాయిలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏఎస్సార్ నగర్ కొండపై జీఎస్ఎల్ఆర్ సామర్థ్యం 1700 కె.ఎల్. సంప్ ద్వారా ఈ వాటర్ ట్యాంక్‌లకు ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచి నీరు సరఫరా చేస్తున్నారు. తాగునీటి సమస్య తీరడంతో కొండవాలు నివాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఏఎస్సార్ నగర్ కొండవాలులో వాటర్ ట్యాంక్

అందుబాటులో తాగునీరు



గతంలో తాగు నీటి కష్టాలతో ఇబ్బంది పడేవారం. ప్రస్తుతం మంచినీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. వాటర్ సంపు ద్వారా ఉదయం తాగునీరు వస్తోంది. జీవీఎంసీ కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తుంది. తాగునీటి సమస్య తీరడంతో ఎంతో ఆనందంగా ఉంది.

– ఆదినారాయణ, ఏఎస్సార్ నగర్

చాలా సంతోషంగా ఉంది



గతంలో మాకు తాగునీరు లేక కొండధారలో వచ్చే నీటిని తాగే వారం. ప్రసుత్తం నీటి కష్టాలు తీరాయి. ప్రతిరోజు మంచినీరు సక్రమంగా వస్తోంది. ఇంటి అవసరాలకు కూడా సరిపోతోంది. చాలా సంతోషంగా ఉంది. మా సమస్యను పట్టించుకున్న పాలకులకు కృతజ్ఞతలు.

– గోన లక్ష్మి, ఏఎస్సార్ నగర్

క్లుప్తంగా

రెండు పుస్తకాల ఆవిష్కరణ


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య బాల మోహన్‌దాస్, రఘురామారావు

సీతంపేట: విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమంచి వినయ భూషణరావు రచించిన 'కథా బృందావనం', 'చిత్ర కవితా సరం' పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆచార్య కోలవెన్ను బాలమోహన్‌దాస్ ఈ పుస్తకాలను ఆవిష్కరించారు. జె.పి.శర్మ పుస్తకాలను సమీక్షించారు. కార్యక్రమంలో పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

క్రైస్తవ మిషనరీల సేవలు చిరస్మరణీయం


మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: జాతి నిర్మాణంలో క్రైస్తవ మిషనరీల సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. క్రిస్మస్ పండగను పురస్కరించుకుని బి.వి.ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలో 'జాతి నిర్మాణంలో క్రైస్తవ మిషనరీల సేవలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యానికి పూర్వం, తరువాత క్రైస్తవ మిషనరీల సేవలు మరువలేనివన్నారు. ఆచార్య బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో వారి సేవలు చాలా గొప్పవని, దేశంలో 60 శాతం విద్య, వైద్య సంస్థలు వారివే అన్నారు. కార్యక్రమంలో సిస్టర్ షకీలా, కె.జ్యోతి, పి.శైలజ రోలెక్స్, పి.శంకరరావు, డాక్టర్ కె.సత్యమూర్తి, బి.చిన్నారావు, గౌరీశంకర్ పాల్గొన్నారు.

రైతులకు వైద్య పరీక్షలు


రైతులను పరీక్షిస్తున్న డాక్టర్ హేమ

సీతమ్మధార: కాస్మోలైఫ్ యూనివర్సల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం సీతమ్మధార రైతుబజార్‌లో వైద్యురాలు బి.హేమ నేతృత్వంలో రైతులకు బరువు, బీపీ, సుగర్, ఎత్తు మొదలగు 21 టెస్టులు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అవసరమైన న్యూట్రిషన్ వాడటం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. వ్యాధులు ఉంటే తక్షణమే తగ్గుతాయని చెప్పారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, 50 మంది రైతులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


లక్ష్మీకుమారి

మర్రిపాలెం: ఓ వివాహిత భర్తతో గొడవల కారణంగా తన పెద్దమ్మ ఇంటికి వచ్చి అక్కడ నుంచి కనిపించకపోవడంపై కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. లక్ష్మీ కుమారి అనే యువతి గతంలో ప్రేమ వివాహం చేసుకుంది. తల్లిదండ్రులు ఆమెను ఇంటికి రావద్దని చెప్పడంతో ఎప్పుడూ తన పెద్దమ్మ ఇంటికి వస్తు ఉండేది. భర్తతో గొడవల కారణంగా ఈ సారి అక్కడికి వచ్చింది. ఈ నెల 15న సదరు లక్ష్మికి ఎవరో ఫోన్ చేశారు. 16వ తేదీ సాయంత్రం 6.15 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఎంతగా ఆరా తీసిన ఫలితం లేకపోవడంతో శనివారం రాత్రి లక్ష్మీకుమారి పెద్దమ్మ కె.హేమ కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతోపాటు కొంత నగదు, బంగారం కూడా తీసుకెళ్లినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ సతీష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో ధనుర్మాసోత్సవాలు


గోదాదేవి ఉత్సవ విగ్రహంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు శేషాచార్యులు, భక్తులు


పాశుర విన్నపం చదువుతున్న ఈవో ప్రసాద్ దంపతులు, భక్తులు

శ్రీరంగనాథుడికి మొదటి పాశుర విన్నపం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామున 4.30 గంటలకు గోదాదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహంతో అర్చకుడు శేషాచార్యులు, భక్తులు మేళతాళాలు, వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రదక్షిణ చేశారు. శ్రీవారి ముఖ్య మండపంలో భక్తుల సమక్షంలో నెల గంటను శాస్త్రోక్తంగా అర్చకులు వాసుదేవాచార్యులు, శేషాచార్యులు, ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రారంభించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం అర్చన చేశారు. తిరుప్పావై సేవా కాలంలో భాగంగా గోదాదేవి తరఫున శ్రీరంగనాథుడికి మొదటి పాశుర విన్నపం చదివి వినిపించారు. శేషాచార్యులు, వాసుదేవాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో ఈవో బండారు ప్రసాద్ దంపతులు, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పాల్గొన్నారు.

వందలాది భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు తిరుప్పావై పఠనంతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. అమ్మవారికి అర్చన అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటరమణ, కె.వెంకటరావులను సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రత్యేక ప్రసాదాలు అందించారు. జనవరి 14 వరకు ప్రతి రోజూ ఉదయం 4.30 గంటలకు ప్రాతఃకాల అర్చన, తిరుప్పావై పఠనం జరుగుతాయని ఈవో బండారు ప్రసాద్ తెలిపారు.

వానప్రస్థ వృద్ధాశ్రమానికి వితరణ


నిత్యావసర సరకులు అందిస్తున్న మణికంఠ సేవా సంఘం సభ్యులు

మురళీనగర్: పట్టాభిరెడ్డి తోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో మురళీనగర్ శ్రీ మణికంఠ సేవా సంఘం సభ్యులు ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. విజయ్ భాస్కరరావు తన తండ్రి గోపాలకృష్ణన్ నాయర్ జ్ఞాపకార్థం అందించిన ఆర్థిక సాయంతో ఆశ్రమంలోని వృద్ధుల కోసం రూ.10,000 విలువ చేసే నిత్యావసర సరకులను అందించారు. కార్యక్రమంలో విజయ్ భాస్కరరావు, శ్రీజ, సూర్య, గీతా నాయర్, ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎం.గిరిగోపాల్, మణికంఠ సేవా సంఘం కార్యదర్శి హెచ్.నాగేంద్ర, కోశాధికారి జి.వి.ఆనందరావు, ఎస్.వి.ఎల్.ఎన్.నరసింహం, జి.వి.మధుసూదనరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

శబరిమల అయ్యప్ప సన్నిధిలో ముత్తంశెట్టి



మాజీ మంత్రి, భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం శబరిమల అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. కొద్ది రోజుల కిందట అయ్యప్ప స్వామి మాలధరించిన ఆయన శబరిమల చేరుకుని ఇరుముడి సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

– తగరపువలస

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్ఐ వెంకటరావు


రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా ఎస్ఐ ధర్మేంద్ర

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఎస్ఐ వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని, తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని వారికి సూచించారు. ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని, మంచిగా నడుచుకోవాలన్నారు. పలువురు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా పీఎస్‌లో..

ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ చేశారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. నేరాల జోలికి పోతే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను హెచ్చరించారు.

అసభ్య పదజాలంతో దూషించారని ఫిర్యాదు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళను ఇంటి యజమాని, ఎదురుగా ఉన్న వారు కలిసి అసభ్యకరమైన పదజాలంతో దూషిండంపై పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గవర కంచరపాలెంలో ఎ.సుజాత అనే మహిళ ఆమె కుమార్తెతో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తోంది. ఆమె ఎదురు ఇంట్లో నివసిస్తున్న కె.భవాని, ఆమె కుటుంబ సభ్యులు సుజాతపై అందరితో లేనిపోని మాటలు చెబుతున్నారు. ఎందుకలా చెబుతున్నారని సుజాత ప్రశ్నించడంతో ఆమెను అసభ్య పదజాలంతో తిట్టడం వంటివి చేశారు. భవాని ఇంటి యజమాని కూడా ఆమెను తిట్టడం, సామగ్రి ఇంట్లో నుంచి బయటకు పడేయడంతో శనివారం రాత్రి వీరందరిపై సుజాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా జాతీయ పింఛన్‌దారుల దినోత్సవం


రైల్వే పెన్షనర్లకు జ్యూట్ బ్యాగులను బహూకరిస్తున్న గల్లా భాస్కరరావు

తాటిచెట్లపాలెం: రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అఖిల భారత పింఛన్‌దారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వేగి నాగేశ్వరరావు అధ్యక్షతన రైల్వే న్యూకాలనీలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకల్లో పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వాల్తేర్ డివిజన్‌లో లోకోపైలట్‌గా పనిచేస్తూ కోవిడ్ సమయంలో మరణించిన గల్లా ఆనంద గిరివాసు జ్ఞాపకార్థం ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా సభ్యులందరికీ జ్యూట్ బ్యాగ్‌లను అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి గల్లా భాస్కరరావు చేతుల మీదుగా బహూకరించారు. అనంతరం మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, సుగర్ వంటి పలు వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్ ఎస్.ప్రవీణ్, డాక్టర్ శ్రీకాంత్ గుండె, కీళ్ల వ్యాధులపై అవగాహన, చికిత్స మార్గాలను వివరించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దొండపర్తి బ్రాంచ్ చీఫ్ మేనేజర్ బి.కె.మహాపాత్రో, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ అధికారులు జి.వి.బాలభాస్కరరావు, చంద్రమోహన్ వృద్ధాప్య దశలో ఆర్థిక భద్రత మీద పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జీఎస్ఎం ఎంవీవీ సత్యసాయిబాబా, ఎస్.మసేను, ఎస్.బి.షా, మదీనా వలీ, కె.వై.నాయుడు, రైల్వే పెన్షనర్స్ పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయ స్వామి, అన్నప్రసాదం వడ్డిస్తున్న అల్లూరి జగన్నాథరాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు ఏఎస్సార్ నగర్ కొండవాలు ప్రాంతంలోని 108 అడుగుల అభయ అంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. శ్రీహనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో అర్చకుడు అనిరుథ్ తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, మహన్యాస పూర్వక మన్యుసూక్త పంచామృతాభిషేకం, దశ సహస్ర నాగవల్లదళ అర్చన, సింధూర పూజ, నీరాజన మంత్రపుష్పాలతో పూజలు జరిపారు. ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన అన్నసంతర్పణలో భక్తులకు అల్లూరి జగన్నాథరాజు అన్నప్రసాదం వడ్డించారు. పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి పటిష్ట ఏర్పాట్లు

సింహాచలం: ఈ నెల 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తితో కలిసి భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి పరిశీలించారు. ఆరోజు ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని.. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేయాలని వారు సూచించారు. చందనోత్సవంలో ప్రముఖులకు సరైన ఏర్పాట్లు చేయలేదన్న అపవాదు రావడంతో ముక్కోటి ఏకాదశికి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పెన్షనర్ల హక్కుల సాధనకు సమైక్య కృషి


మాట్లాడుతున్న షిప్‌యార్డ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాదరావు

మురళీనగర్: పెన్షనర్ల హక్కుల సాధనకు సమైక్యంగా కృషి చేద్దామని హిందుస్థాన్ షిప్‌యార్డ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ప్రసాదరావు అన్నారు. పెన్షనర్స్ డే సందర్భంగా మురళీనగర్ వాకర్స్ పార్కులో వార్షికోత్సవాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 70వేల మంది ఈపీఎస్ 95 వేల మంది వరకు పెన్షన్‌దారులు ఉన్నత న్యాయ స్థానంలో చేస్తున్న పోరాట వివరాలను తెలిపారు. న్యాయపోరాటం కారణంగా ఫలితాలు కేవలం 20 శాతం మందికే అందుతున్నాయని మిగతావారికి ఆ ఫలితాలు అందే విధంగా పోరాడాలన్నారు. ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్ మాట్లాడుతూ హయ్యర్ పెన్షన్ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి ఉందని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నలుగురు సీనియర్ సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి జి.గోపాలకృష్ణ, పీవీ గోపాలరావు, గౌరవాధ్యక్షుడు, బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రమంతటా బ్యాంకు వ్యాపార పరిధి విస్తరణ


మాట్లాడుతున్న మహారాజా బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణంరాజు

సీతమ్మధార: ది మహారాజా కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ ప్రత్యేక మహాజన సభ బ్యాంక్ ఆదివారం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో సీతమ్మధార క్షత్రియ సంక్షేమ సమితి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తమ బ్యాంకు వ్యాపార పరిధి విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ జిల్లాలకు విస్తరించి ఉందని తెలిపారు. రాష్ట్రమంతటా వ్యాపార పరిధిని విస్తరించేలా బై లా–3ను సవరించడానికి సభ ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు. బ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.20 కోట్లు పెరిగి రూ.257.57 కోట్ల డిపాజిట్లు, రుణాలు రూ.10 కోట్లు పెరిగి, రూ.176.61 కోట్లు కలిగి ఉన్నాయని వెల్లడించారు. కూర్మన్నపాలెంలో నూతన శాఖను ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 7 శాఖలతో 4 ఏటీఎంలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జి.బంగార్రాజు, ఎం.వి.ఎస్.డి.ఎస్.ఆర్.కె.వర్మ, జనరల్ మేనేజర్ ఎన్.ఎస్.సత్యనారాయణరాజు, ఖాతాదారులు, వాటాదారులు పాల్గొన్నారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

సీతమ్మధార: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్టుగా పేకాటాడుతున్న 12 మందిని పోలీసులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాలిలా.. గురుద్వారా ఎన్ఆర్ఐ ఆస్పత్రి ఎదురుగా జీవీకే ఇన్‌లో కొందరు పేకాటాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు సిబ్బందితో కలిసి ఆ హోటల్‌పై దాడి చేశారు. అక్కడ 304 రూంలో పేకాటాడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,40,690 నగదు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ త్రినాథరావు తెలిపారు.